సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



రైతుల శ్రమదానం

సోంపేట: బెంకిలి, జింకిభద్ర గ్రామాలకు చెందిన రైతులు సాగునీటి కోసం ఆదివారం శ్రమదానం చేపట్టారు. పైడిగాం కాలువలో సోంపేట నుంచి సుంకిడి వరకు కాలువలో అడ్డంకులు తొలగించి, అవసరమైన చోట ఇసుక బస్తాలు వేశారు.



సరిహద్దులో ముమ్మర తనిఖీలు

పాతపట్నం: ఒడిశా, ఆంధ్ర సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య ఆధ్వర్యంలో ఒడిశా నుంచి వచ్చే వాహనాలను పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను తనిఖీలు చేశారు.

యూరియా కోసం నిలదీసిన రైతులు

టెక్కలి: కోటబొమ్మాళి గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద పలువురు రైతులు ఆదివారం సిబ్బందిని నిలదీశారు. ఆదివారం సాయంత్రం కొంత మంది రైతులు గ్రోమోర్ దుకాణానికి వచ్చి యూరియా కోసం ప్రాధేయపడగా.. స్టాకు లేదని చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం ఎప్పుడూ ఇలా ఇబ్బందులు పడలేదంటూ రైతులు విసుగుచెంది వెళ్లిపోయారు.



అక్రమ కేసులు



ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను సాక్షి దినపత్రిక ప్రజలకు తెలియజేస్తుంటే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రశ్నించే తత్వం కరువైపోతుంది.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు



రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కథనాలు, నాయకుల ప్రెస్‌మీట్లకు సంబంధించిన అంశాలపై వార్తలు రాస్తే అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై పెట్టిన కేసును తక్షణమే తొలగించి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి.

– పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

బడ్జెట్ ఖర్చులపై కలెక్టర్ ఆరా

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో కీలక అధికారి తీసుకుంటున్న నిర్ణయాలు, ఉద్యోగ వర్గాల కలహాలతో పాటు పలు ప్రోగ్రాంల కింద మంజూరైన బడ్జెట్ నిధుల స్వాహా యత్నాలపై ఈనెల 11న 'సాక్షి'లో 'కలహాల కాపురం ..నిధుల భోజనం' పేరిట ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ స్పందిస్తూ.. బడ్జెట్ ఖర్చులపై ఆరా తీసినట్లుగా సమాచారం. దీంతో పాటు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారుల నిర్లక్ష్యం, ఉద్యోగుల వర్గ విబేధాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ కథనం అనంతర పరిణామాలపై కూడా కలెక్టర్ ఆరా తీస్తున్నట్లుగా తెలిసింది. ఈ నెల 11నే జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆయా ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. అసలు బడ్జెట్ ఖర్చుల విషయాలు బహిర్గతం కావడంపై ఆమె పలువురిపై అనుమానాలను వ్యక్తం చేశారు.

'మెడికల్ కాలేజీలపై చర్చ జరగాలి'



ధర్మాన కృష్ణదాస్

పోలాకి (నరసన్నపేట): ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలల నిర్మాణం విషయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పంతో ముందుకెళ్తే, ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం ప్రైవేటు దళారులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్య అందుబాటులో లేకుండా పోతుందన్నారు. దీనిపై అన్ని వర్గాల్లోనూ చర్చ జరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే మీడియాపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మీడియా స్వేచ్ఛను హరిస్తే.. ప్రజల గొంతు మూయించినట్టేనని తెలిపారు.

సచివాలయం అద్దాలు ధ్వంసం



మెట్టూరు బిట్-2 సచివాలయం భవనం కిటికీ అద్దాలు పగలు గొట్టిన దుండగులు

కొత్తూరు: మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీ గ్రామ సచివాలయ భవనం అద్దాలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలుగొట్టారు. ఈ పనిని ఆకతాయిలు చేశారా, లేదా ఎవరైనా దొంగలు చేశారా అన్నది తెలియాల్సి ఉంది. అద్దాలు పగలు గొట్టినట్లు ఆదివారం ఎంపీడీఓ నీరజకు సర్పంచ్ యర్లంకి ధర్మారావు ఫిర్యాదు చేశారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పోలీసులకు ఇంకా ఫిర్యాదు చేయలేదని సర్పంచ్ తెలిపారు.

గణతంత్ర పరేడ్‌కు నేడు ఎంపికలు

ఎచ్చెర్ల: జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవం పరేడ్‌లో పాల్గొనే వలంటీర్ల ఎంపిక సోమవారం బీఆర్‌ఏయూలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.వనజ తెలిపారు. ఈ ఎంపికలు ఎన్‌ఎస్‌ఎస్ స్టేట్‌యూత్ అధికారి సైదారమావత్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

ఇచ్ఛాపురం పోస్టాఫీస్



దాచుకున్న సొమ్ము.. దోచేశారు

- ఇచ్ఛాపురం పోస్టాఫీసులో రూ.2.78 కోట్ల భారీస్కామ్
- పబ్లిక్ గ్రీవెన్స్‌తో వెలుగులోకి వచ్చిన స్కామ్
- 36 ఖాతాల నుంచి సొమ్ము కాజేసిన వైనం
- విచారణ చేపడుతున్న అధికారులు

ఇచ్ఛాపురం:

ఆ పోస్టాఫీసులో ఖాతాదారులంతా సామాన్య పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. భవిష్యత్ అవసరాల కోసం రూపాయి రూపాయి దాచుకుంటున్న వారే. ప్రభుత్వ సంస్థ కాబట్టి తమ సొమ్ము భద్రంగా ఉంటుందని భావించారు. కానీ అక్కడ కూడా పేదల సొమ్ముకు భద్రత లేకుండా పోయింది. అదే సంస్థలో పనిచేస్తున్న వారు చేతివాటం చూపి సొమ్మును కాజేయడంతో ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. వేలు, లక్షలు కాదు ఏకంగా రూ.2.78 కోట్లను ఇచ్ఛాపురం పోస్టాఫీసులో కాజేశారు. వివిధ పోస్టాఫీసుల్లో విధులు నిర్వహించిన 15 మందికి పైగా సిబ్బంది సైబర్ నేరగాళ్ల సాయంతో ఈ క్రైమ్ చేశారు. 2025 జూలై నెల 7వ తేదీన ఒక వ్యక్తి పోస్టల్ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో పోస్టల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టడంతో స్థానిక పోస్టాఫీస్‌లో గల కేవీపీ (కిసాన్‌వికాశ్‌పత్ర) టీడీ, ఆర్‌డీలకు చెందిన 34 ఖాతాల్లో ఈ కుంభకోణం జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఈ స్కామ్‌కు పాల్పడిన వారిలో అనుమానితులుగా 15 మందిని గుర్తించి వారిలో ఐదుగురిని సస్పెండ్ చేశారు.

జూలై నెలలోనే సంబంధిత ఖాతాదారులను పోస్టాఫీస్ వద్ద విచారించారు. ఖాతాదారులకు కనీసం ఎలాంటి సమాచారం లేకుండానే వారి ఖాతాల నుంచి డబ్బులు కాజేసిన సంగతి అప్పుడే తెలిసింది. దీంతో అంతా ఆందోళనకు దిగారు. ఇదే విషయంపై పోస్టల్ ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం, సోంపేట డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ శ్రీకాంత్, కమల్‌హాసన్ స్థానిక పోస్టాఫీస్‌లో విచారణ చేపట్టారు. ఈ భారీ స్కామ్‌కి సంబంధించిన బాధిత ఖాతాదారుల నుంచి క్లెయిమ్స్‌లను తీసుకొన్నారు.

నకిలీ పత్రాలతో..

ఈ విచారణ జరుగుతున్న క్రమంలో కొంతమంది ఖాతాదారులు వచ్చి వారి ఖాతాలను పరిశీలించాలని సిబ్బందిని కోరగా ఖాతాలలో డిపాజిట్ చేసుకున్న ఒక్క రూపాయి కూడా లేదనే విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా పోస్టల్ ఖాతాలకు సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించి ఖాతాల నుంచి సొమ్మును కాజేసినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు ఖాతాదారులతో మాట్లాడుతూ ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వడ్డీతో సహా అందరి డబ్బు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు.



పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు(ఫైల్)



కూతురి పెళ్లి కోసం దాచుకున్నా



నేను మెకానిక్‌గా పనిచేస్తుంటా. నా భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో పాటు దాచుకున్న డబ్బును కుమార్తె వివాహం కోసమని పోస్టాఫీసులో దాచుకున్నాను. పోస్టాఫీసులో డబ్బు ఉందనే ధీమాతో బయట అప్పు చేసి కుమార్తెకు వివాహం చేశాను. ఇప్పుడు నా డబ్బు పోయిందని అంటున్నారు. నా అప్పు ఎలా తీర్చాలి.

– ఇసురు బాలరాజు, బైక్ మెకానిక్, ఇచ్ఛాపురం

డబ్బు కాజేశారు



నా కుటుంబంలో ఏడుగురు ఆడపిల్లలు ఉన్నారు. వారి చదువులు, వివాహం కోసం 2017 సంవత్సరంలో రూ.11 లక్షలు డిపాజిట్ చేశాను. ఇప్పుడు మా ఖాతాలను, బాండ్లను తనిఖీ చేయిస్తే డూప్లికేట్‌గా గుర్తించారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– చాట్ల లోహిదాస్, ఇచ్ఛాపురం

సొమ్ము ఇప్పించాలి



ఇండియన్ ఆర్మీలో సేవ చేసి రిటైరైన తర్వాత వచ్చిన సొమ్మును పోస్టాఫీస్‌లో భద్రంగా ఉంటుందని దాచుకొంటే దాన్ని కాజేశారు. పోస్టాఫీస్‌లోనే భద్రత కరువైతే మరెక్కడ దాచుకోవాలి. నష్టపోయిన ఖాతాదారులందరికీ న్యాయం చేయాలి.

– ఉప్పాడ జ్యోతిసాయికుమార్, మాజీసైనికుడు

వడ్డీతో సహా డబ్బు వస్తుంది



ఖాతాదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ స్కామ్‌కి పాల్పడిన వారిలో ఐదుగురిని సస్పెండ్ చేయడంతో పాటు ఈ కేసుని సీబీఐకి అప్పగించడం జరిగింది. పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన ప్రతి ఖాతాదారునికి నియమ నిబంధనలను అనుసరించి వడ్డీతో ప్రతీ పైసా చేరుతుంది.

– వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్, శ్రీకాకుళం

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ



కేవీజీ సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పురుషోత్తపురం దళిత కుటుంబాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పంచాయతీలో గల దళితులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ సమక్షంలో ఆదివారం ఆ పార్టీలో చేరారు. మొత్తం 30 కుటుంబాలకు చెందిన 150 మందికి సత్యనారాయణ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. శ్రీకాకుళం నగరంలోని న్యూకాలనీలోగల కేవీజీ సత్యనారాయణ నివాసగృహానికి వచ్చి మరీ వారంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ కొంచాడ కృష్ణారావు మాట్లాడుతూ టీడీపీలో గత 35 ఏళ్లుగా ఉన్నా తమను పట్టించుకున్నవారే లేరని, వైఎస్సార్‌సీపీలోనే తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో పార్టీలో చేరామన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ సంక్షేమ పథకాలు సైతం ఇవ్వకుండా వివక్ష చూపిస్తోందని తెలిపారు. వైఎస్ జగన్ గెలుపు కోసం కేవీజీ సత్యనారాయణతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా కేవీజీ సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ మీద ఉన్న నమ్మకంతో చేరిన వారికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. రాకోటి శ్రీనివాసరావు, బెలమాన వాసుదేవరావు, నక్క రామారావు, చింతాడ కృష్ణ, ముచ్చ ధనరాజ్, యాగాటి రవి, యాగాటి లక్ష్మి, కొంచాడ అప్పారావు, గుగ్గిల అశిరినాయుడు, బెలమాన గణేష్, మన్నేన పోలయ్య, మన్నేన పాపారావు, లింగాల శంకర్, బొంతల శంకరరావు, పైడి లక్ష్మన్నాయుడు, బగాది రామారావులో పాటు మరికొన్ని కుటుంబాలు చేరాయి. పార్టీలో చేరికలో గ్రామ ఉపసర్పంచ్ పైడి నర్సింహ అప్పారావు పాల్గొన్నారు.

అచ్చెన్న అసమర్థత వల్లే ఎరువుల కొరత

- అచ్చెన్నాయుడు అసమర్థతను ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు
- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్



పేరాడ తిలక్

టెక్కలి: రైతుల కష్టాలు తెలియని అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండడం రాష్ట్రానికి పెద్ద దౌర్భాగ్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అచ్చెన్నాయుడు అసమర్థతను ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారని తెలిపారు. అదే విషయంపై వార్తలు రాస్తుంటే మీడియాపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. సంతబొమ్మాళి మండలం ఆకాశ లక్కవరంలో యూరియా కోసం రైతులు టీడీపీ నాయకులను నిలదీస్తే.. దాన్ని వ్యక్తిగత తగాదాలకు వక్రీకరించి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సుగ్గు రామిరెడ్డిపై అక్రమంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం అచ్చెన్నాయుడు చేతకానితనం అని తిలక్ మండిపడ్డారు. 'సాక్షి' దినపత్రికలు దహనం చేయడం అప్రజాస్వామ్యమన్నారు. రైతులకు చెందాల్సిన వ్యవసాయ యంత్రాల కొనుగోలులో అవినీతికి పాల్పడిన అచ్చెన్న రైతుల పొట్ట కొట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమానికి పాటు పడిన వైఎస్ జగన్‌ను విమర్శిస్తున్న అచ్చెన్నాయుడును పాతాళానికి పూడ్చిపెట్టడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు.

కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల్లో 25 శాతం సబ్సిడీ సుమారు రూ.1500 కోట్లు టీడీపీ ప్రభుత్వం ముందుగానే కొట్టేయడంతో ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. టెక్కలిలో మంత్రి అనుచరులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రూ.500 నుంచి రూ.600కు అమ్ముకుంటున్నారని, దీనిపై బహిరంగ చర్చకు అచ్చెన్నాయుడు సిద్ధమా అని సవాల్ చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లేని ఎరువుల కొరత ఇప్పుడెందుకు వచ్చిందన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేకపోయారని, గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చి చరిత్ర సృష్టించారని తిలక్ గుర్తు చేశారు. ఆ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు కుట్ర పన్నారని తిలక్ దుయ్యబట్టారు.

కొత్త పీఆర్సీ తక్షణం వేయాలి

- ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఏపీ ఎన్జీఓ సంఘం నిరంతరం పనిచేస్తోంది
- ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్

శ్రీకాకుళం అర్బన్: సంఘం నిత్య చైతన్యంతో ఉంటేనే ప్రభుత్వాన్ని ప్రశ్నించగలమని ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆదివారం మొదటిసారి శ్రీకాకుళానికి ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. వీరికి జిల్లా సంఘ నాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ఇప్పటికీ సరిగ్గా అమలు కావడం లేదని తెలిపారు. తక్షణం కొత్త పీఆర్సీ వేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు కూడా సరిగ్గా ఆర్థిక ప్రయోజనాలు దక్కడం లేదని తెలిపారు. త్వరలో ఏపీఎన్జీఓ సంఘం తరపున విజయవాడలో రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిస్తామని, అందులో సంఘం విధులు–బాధ్యతలు వివరిస్తామని పేర్కొన్నారు. కొత్త కార్యవర్గాల్లో ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ ఒకే డిపార్ట్‌మెంట్‌కు చెందిన వ్యక్తులకు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. బాధ్యతలు లేని రాష్ట్ర నాయకత్వాలు ఉండవని ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ అన్నారు. సంఘంలోని సభ్యులంతా ఏకతాటిపై నడిచి సభ్యత్వ నమోదు నుంచి కార్యవర్గ ఏర్పాటు వరకూ, అటుపై కార్యాచరణ వరకూ, కూర్పు నుంచి మార్పు వరకూ పనిచేయాలన్నారు. గతంలో పనిచేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు స్ఫూర్తితోనే పనిచేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ ఎన్జీఓ సంఘ నాయకులు చౌదరి పురుషోత్తమనాయుడు, హనుమంతు సాయిరాం, ఆర్.వేణుగోపాల్, బడగల పూర్ణచంద్రరావు, కంఠ జయరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆశలపై నీరు.. రైతన్నకు కన్నీరు

- రెగ్యులర్ వంశధార ఎస్ఈని నియమించేదెప్పుడో..?
- ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ లేక ఇబ్బందులు
- ఇంజినీర్లు లేక జిల్లా రైతులకు సాగునీరు కరువు



ఖాళీగా దర్శనమిస్తున్న వంశధార ఎస్ఈ సీటు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శివారుకు అందని సాగునీరు, పూడికలు తీయని కాలువలు, ఆధునికీకరణకు నోచుకోని ప్రాజెక్టులు.. జిల్లాలో సాగునీటి నిర్వహణ తీరు ఇది. పాలకుల నిర్లక్ష్యానికి తోడు సిబ్బంది కొరత కూడా సాగునీటి నిర్వహణకు శాపంలా మారింది. జిల్లాలో సాగునీటి వనరుల సద్వినియోగానికి వైఎస్ రాజశేఖర రెడ్డి వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. పనులు వేగంగా జరిగేందుకు బీఆర్‌ఆర్ వంశధార సర్కిల్, ఇరిగేషన్ సర్కిల్స్‌ని ఏర్పాటుచేసి దానికి ఎస్ఈలను నియమించారు. వీరు ప్రాజెక్టుల పనులను పరిశీలించడంతో పాటు పలు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అప్పగించాలి. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి డివిజన్లలో ఉండే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈలు, ఏఈలు, జేఈలతో పాటు అటెండర్లు, లస్కర్లను పర్యవేక్షించే బాధ్యత కూడా వీరిపైనే ఉంటుంది. కానీ ఇక్కడ రెగ్యులర్ ప్రాతిపదికన ఎస్ఈ పనిచేయడం అన్నది దాదాపు అసాధ్యమైపోయింది. ఎవరూ పట్టుమని పదిరోజులు కూడా ఉండడం లేదు. నిరంతరం వంశధార సర్కిల్ ఎస్ఈ గది, కుర్చీ ఖాళీగానే దర్శనం ఇస్తుండడం గమనార్హం.

సర్కిల్ ఎస్ఈని నియమించరా..?

జిల్లాలో వంశధార సర్కిల్ ఎస్ఈగా పనిచేసిన డోల తిరుమలరావును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షసాధింపు చర్యలో భాగంగా వేరే జిల్లాకు బదిలీ చేశారు. ఆ తర్వాత వంశధార సర్కిల్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న స్వర్ణకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొన్నాళ్లు విధులు నిర్వహించిన అనంతరం టెక్కలి నియోజకవర్గానికి చెందిన ఇంజినీర్ తిరుపతిరావును రిటైర్‌మెంట్‌కి ముందు మూన్నాళ్ల ముచ్చటగా తీసుకొచ్చారు. ఆయన మేలో రిటైరయ్యారు. ఆ తర్వాత స్వర్ణకుమార్‌కి మళ్లీ బాధ్యతలు అప్పగించారు. ఆయన టీటీపీఆర్ ఎస్ఈగా పదోన్నతిపై వెళ్లిపోయారు. అయినప్పటికి మళ్లీ వదలకుండా ఆయనకే వంశధార ఎస్ఈగా, నార్త్‌కోస్ట్ సీఈగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. దీంతో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం మూడుచోట్ల తిరగలేక మెడికల్ లీవ్‌పై మూడు నెలలు వెళ్లిపోయారు. అప్పుడు ఏకంగా రాజమండ్రిలోగల ధవళేశ్వరం ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఈగా ఉన్న కర్నా శ్రీనివాసరావుకి అదనపు బాధ్యతలు అప్పగించారు. 350 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే సరికే సాయంత్రం అయిపోతోంది. పనులు పరిశీలించడం, ఫైల్స్ చూడడం అసాధ్యమైపోతోంది.

ఇక్కడ అర్హులే లేరా..?

జిల్లాలో ఎంతోమంది సీనియర్ ఇంజినీర్లు ఉన్నా వారందరినీ వదిలేసి ఎక్కడో ఉన్న ధవళేశ్వరం ఈఈకి వంశధార ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై ఉత్తరాంధ్ర, శ్రీకాకుళం జిల్లా ఇంజినీర్లు మండిపడుతున్నారు. అత్యవసరమైతే కింది స్థాయి సిబ్బంది, కాంట్రాక్టర్లు ఫైల్స్ తీసుకుని ధవళేశ్వరం పరుగులు పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. సరైన పర్యవేక్షణ లేక పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట, గార, శ్రీకాకుళం రూరల్ మండలాలకు నీరివ్వలేకపోతున్నారు.

చదివింది ఎంబీఏ..

చేస్తున్నది దొంగతనం

- ఏటీఎం కార్డులను కొట్టేసి నగదు కాజేసిన ఘనుడి అరెస్టు
- జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న ఎంబీఏ పట్టభద్రుడు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని పలు ఏటీఎం సెంటర్లలో నడి వయస్కులను, వృద్ధులను ఏమార్చి ఏటీఎం కార్డులను మార్చేసి నగదు కొట్టేసిన ఘనుడిని ఎట్టకేలకు శ్రీకాకుళం సీసీఎస్ సీఐ ఎస్ సూర్యచంద్రమౌళి ఆధ్వర్యంలోని సిబ్బంది శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఐదు కేసుల్లో నిందితుడైన నరసన్నపేటకు చెందిన యువకుడు పేడాడ చిన్నబాబును ఆమదాలవలస ఎస్ఐ బాబూరావు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

రిటైర్డు హెడ్‌కానిస్టేబుల్‌ను ఏమార్చి..

ప్రస్తుతం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా ఉన్న హెడ్‌కానిస్టేబుల్ పేడాడ ధర్మారావు సోదరుడు రామారావు కూడా రిటైర్డ్ హెడ్ కానిస్టేబులే. ఈయనది కొర్లకోట గ్రామం. రామారావు గత నెల 8న ఆమదాలవలస స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి ఏటీఎం సెంటరు లోపలికి డబ్బులు తీసేందుకు ఉదయం 10 గంటలకు వెళ్లాడు. పిన్ నంబర్ కొడుతుండగా వెనుకగా ఉన్న చిన్నబాబు చూశాడు. కొంత సొమ్మును డ్రా చేసి లెక్కపెడుతుండగా చిన్నబాబు కావాలనే రామారావుకు తగలడంతో తన కార్డును జారవిడిచాడు. ఏమరపాటులో రామారావును మాటల్లో పెట్టిన చిన్నబాబు కార్డు అందుకున్నట్లు నటించి తన వద్దనున్న మరో ఎస్‌బీఐ ఏటీఎం కార్డును మార్చేశాడు. అక్కడికి కొద్ది గంటల్లోనే రూ.40 వేలను మాయం చేశాడు. ఇదే తరహాలో అదే ఏటీఎం మిషన్ వద్ద కుదిరం గ్రామానికి చెందిన బసవ కృష్ణవేణి ఏటీఎం కార్డును మార్చి రూ. 30 వేలు నగదు కాజేశాడు. అంతకుముందే నరసన్నపేటలో రెండు, లావేరు పీఎస్ పరిధిలో ఓ చోట చోరీలు చేశాడు.

విచారణలో దిగిన పోలీసులు..

ఆమదాలవలస సీఐ జె.సత్యనారాయణ పర్యవేక్షణలోని ఎస్ఐ బాబూరావు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను పరిశీలించాక నిందితుడిని పేడాడ చిన్నబాబుగా గుర్తించారు. విశాఖపట్నం పోలీసులకు వాంటెండ్ క్రిమినల్‌గా ఉన్న చినబాబు గతంలో 25 కేసుల్లో అరెస్టై రిమాండ్‌కు వెళ్లాడని తెలిసింది. ఎంబీఏ వరకు చదువుకున్న చిన్నబాబు సాంకేతికంగాను, చదువులోనూ తెలివైనవాడని, జల్సాలకు అలవాటు పడి గత పదేళ్లుగా దొంగతనాలు చేస్తూ లెక్కకు మించి కేసుల్లో నిందితుడై కటకటాల్లోకి వెళ్లినట్లు తెలుసుకున్నారు. సీసీఎస్ పోలీసులకు జిల్లా కేంద్రంలోనే అతడు దొరకగా ఆమదాలవలస స్టేషన్‌కు అప్పగించారు. నిందితుని వద్ద నుంచి రూ.1.50 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



మురళీకృష్ణ కుటుంబానికి చెక్ అందజేస్తున్న పోలీసులు

మందస: ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు దళంలో విధులు నిర్వహించిన ఏఆర్ కానిస్టేబుల్ బెహరా మురళీకృష్ణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఈ నెల 8న మృతి చెందారు. మందస కిల్లమ్మ వీధిలో నివాసం ఉంటున్న ఆయన భార్య మమతారాణికి ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రోణంకి కృష్ణంనాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంగన్‌వాడీల పోరాట ఫలితంగానే మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మినీ అంగన్‌వాడీల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసీడీఎస్) పరిరక్షణకు అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుధ, కె.కళ్యాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సభలో యూనియన్ నాయకులు హైమావతి, శాంతామణి, కె.వి.హేమలత, కె.సుజాత, జె.కాంచన, భూలక్ష్మి, చంద్రమౌళి, మాధవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సెలవులు మంజూరు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ 6వ మహాసభలు నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను సీనియర్ ఆశా వర్కర్ జి.పార్వతి ఆవిష్కరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా అధ్యక్షురాలు డి.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆశాల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వేతనాలు పెంపుదల చేయాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా కె.నాగమణి, అధ్యక్షురాలిగా డి.ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగా డి.దమయంతి, పి.జయలక్ష్మి, జి.పార్వతి, ప్రధాన కార్యదర్శిగా జి.అమరావతి, సహాయ కార్యదర్శులుగా పి.ప్రేమలత, స్వర్ణలతా పట్నాయక్, ఎం.లావణ్య, కోశాధికారిగా వై.సుజాతతో పాటు 35 కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.వి.రమణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాస్త్రం

- నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా తప్పనిసరి
- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రారంభం



బూరగాం గ్రామంలో ఆవులు



సీదిలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ కరుణకరావు (ఫైల్)

పాతపట్నం: జిల్లాలో వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యం కలిగినది పాడి పరిశ్రమే. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు ప్రతి రైతు కుటుంబం పాడి పశువులు కలిగి ఉంటుంది. వీటిపై సీజనల్ వారీగా పలు వ్యాధులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా పశువులకు వైరస్ ద్వారా గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. దీనిని అడ్డుకట్ట వేయడానికి గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం నాలుగు నెలలు దాటిన పశువులు, ఆవులు, ఎద్దులకు టీకాలు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుం వచ్చే నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుసుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 3,66,786 పశువులు ఉండగా, అందులో 3,41,335 లక్షల ఆవుజాతి పశువులు, 25,451 వేలు గేదెజాతి పశువులు ఉన్నాయి. ప్రస్తుతం పశు వైద్యశాఖ ద్వారా ఉచితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల పరిధిలో 3,30,000 డోసుల వ్యాధి నిరోధక టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

- గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ. పశువుల్లో వేడి అధికమై జ్వరం సోకి చూలు పశువుల్లో గర్భం విఫలమయ్యే అవకాశం ఉంటుంది.
- ఈ వ్యాధి సోకితే పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గి జ్వరం కూడా వస్తుంది. దాని తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగి పశువులు నీరసిస్తాయి. ఎద్దులకైతే పని చేసే సామర్థ్యం తగ్గిపోతుంది.
- నోటి లోపల పైపార, పళ్లు, చిగుళ్లు, నాలుక లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడుతుంది. దీంతో పశువులు, ఆవులు, గేదెలు మేత తినకుండా నోటి నుంచి చొంగ కారుతుంది. దీంతో పశువులు నీరశించిపోతాయి.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశం ఉంటుంది. పాదుగుపై బొబ్బలు ఏర్పడతాయి. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ ఎండ వేడికి తట్టుకోలేక నీరసిస్తాయి.
- పశువుల లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒక చోటి నుంచి మరో చోటుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఫలితంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది.

నివారణ చర్యలు ఇలా..

- పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్‌ను రక్తంలోకి ఎక్కించాలి. నోటిలో పుండ్ల వల్ల మేత సరిగా మేయవు. దీంతో పశువులకు శక్తినిచ్చి సులభంగా అరిగే పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి.
- కాలి గిట్టల మధ్య పండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. ప్రతి పాడి రైతు నాలుగు నెలలు వయసు పైబడిన ఆవులు, గేదెలకు ప్రభుత్వం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ఫలితంగా పశువులు, ఆవులకు గాలికుంటు వ్యాధి అదుపు చేసే అవకాశం ఉంటుంది. పాడి రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రాజగోపాల్, సంయుక్త సంచాలకుడు, పశుసంవర్ధకశాఖ, శ్రీకాకుళం

అరసవల్లిలో భానుసప్తమి సందడి



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు



దర్శనాలకు బారులు తీరిన భక్తులు



ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై భక్తజనం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భానుసప్తమి సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలను కిటకిటలాడాయి. ఆరోగ్య ప్రదాతకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం 5.30 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో సజావుగా దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం బయట భక్తుల కోసం ఆలయ ఈవో కె.ఎస్.వి.డి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసినప్పటికీ.. భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో ఏర్పాట్లు సరిపడలేదనే విమర్శలు వినిపించాయి. కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకుని ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసుకుని దర్శనాలకు బారులు తీరారు. ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా సూర్యనమస్కారాల పూజలను చేయించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణ కలిగిన భక్తులకు మాత్రమే అనుమతించారు. పలువురు భక్తులు తమ పెద్దల పేరిట ఆలయ అభివృద్ధికి, అలాగే నిత్యాన్నదాన పథకానికి విరాళాలను సమర్పించారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు జె.సుభద్ర కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలను ఇచ్చారు. వేదాశీర్వచనాన్ని అర్చకులు అందజేసారు.

ఆదాయం రూ.6.24 లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి భానుసప్తమి సందర్భంగా ఒక్కరోజులో రూ.6,24,188 వరకు ఆదాయం లభించింది. దర్శనాలకు వివిధ రకాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3.18 లక్షలు, విరాళాల ద్వారా రూ.80,188, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.26 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈవో ప్రసాద్ వివరించారు.

స్కూల్లో గొడవ.. పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ!

- విద్యార్థి, కుటుంబ సభ్యులపై దాడి చేయించిన టీడీపీ నేత
- అధికార పార్టీ కావడంతో కేసు నమోదులో పోలీసుల తాత్సారం



గాయపడిన మహిళ, కుమారుడు

శ్రీకాకుళం రూరల్ : పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఇరు కుటుంబాలు టీడీపీకి చెందినవి కావడంతో రాజీ చేసేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. చాపురం పంచాయతీకి చెందిన ఓ టీడీపీ సీనియర్ నాయకుడు.. రాగోలులో నివాసముంటున్న ఆమదాలవలసకు చెందిన మరో టీడీపీ నాయకురాలి పిల్లలు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఓ విషయమై ఇద్దరు పిల్లలు పాఠశాలలో గొడవపడ్డారు. ఈ విషయాన్ని చాపురంలో ఉంటున్న టీడీపీ నేతకు కుమారుడు చెప్పడంతో వారంతా వెళ్లి రాగోలులో నివాసముంటున్న టీడీపీ సభ్యురాలిపైన, ఆమె కుమారుడిపైన దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో బాధితులు శ్రీకాకుళం రూరల్ పోలీస్టేషన్‌ను ఆశ్రయించారు. ఇది జరిగి మూడు రోజులు కావస్తున్నా పోలీసులు మాత్రం కేసు నమోదు చేయడం లేదు. తీవ్రంగా గాయపడిన మహిళ మాత్రం దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌లో తిష్టవేసింది. అయినప్పటికీ పోలీసులు రాజీచేసే దిశగా చేస్తున్నారే తప్ప కేసు నమోదు చేయడంలో వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ రాము వద్ద ప్రస్తావించగా ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

ఎరువుల కొరతతో రైతుల గగ్గోలు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఎరువుల కొరతతో రైతులు గగ్గోలు పెడుతున్నారని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇటీవల రాత్రివేళ ఆందోళన చేపట్టడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీస అవసరమైన ఎరువులు సకాలంలో అందించలేని ప్రభుత్వ అసమర్థత బయట పడుతోందన్నారు. సమస్యను ఉద్యోగుల భుజాలపై మోపడం అన్యాయమని తమ్మినేని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళా ఉద్యోగులు, గర్భిణులు, బాలింతలు రాత్రివేళల్లో సమావేశాలకు హాజరుకావాల్సిన పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అసలు ఇలాంటి సమస్య రాలేదని, కోవిడ్ కాలంలో కూడా ఎరువుల కొరత రానీయలేదని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి అల్లంశెట్టి ఉమామహేశ్వరావు, బూర్జ జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

రాజభాషగా హిందీని ఆదరించాలి

- హిందీ దివస్ వేడుకల్లో వక్తలు
- ఐదుగురు ప్రముఖులకు సన్మానం



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హిందీమంచ్ సంస్థ ప్రతినిధులు



పలాసలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాజభాషగా హిందీని ఆదరించాలని, భాషాభివృద్ధికి అందరూ తోడ్పాటు అందించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని బీకేఎస్ జూనియర్ కాలేజీలో హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. హిందీ మంచ్ జిల్లా అధ్యక్షుడు కనుగుల సత్యం అధ్యక్షతన హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విశ్రాంత జిల్లా అధికారి సురంగి మోహనరావు, సంఘ సేవకులు బి.ఏ.రావులు మాట్లాడుతూ రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని కోరారు. కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ సలహా మండలి సభ్యురాలు బైపల్లి రాజేశ్వరి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద 3వ భాషగా గుర్తింపు అందుకున్న హిందీని అందరూ నేర్చుకోవడం అవసరమన్నారు. హిందీ మంచ్ ముఖ్య ప్రతినిధులు కనుగుల సత్యం, రొంపిలవలస రామారావు, దొంతం పార్వతీశం తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో హిందీని ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని వివరించారు. పండిట్ కళాశాల శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఎల్పీ సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, వేలాది మంది హిందీ పట్టభద్రులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

సేవలకు సత్కారం..

హిందీ భాషాభివృద్ధికి విశేషంగా సేవలు అందించిన కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారు బైపల్లి రాజేశ్వరి, సంఘ సేవకులు బి.ఎ.రావు (పెదపాడు), పండిత పరిషత్ నాయకురాలు కనిమెట్ట పద్మావతి, హిందీ రిసోర్స్ పర్సన్ చిరంజీవినీ రెడ్డి, కనుగుల సత్యం(జడ్పీహెచ్ఎస్, ఆక్కులపేట)లకు ఘనంగా సత్కరించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలుగా నిలిచిన 13 మంది విద్యార్థులకు, హిందీ దివస్ సందర్భంగా నిర్వహించిన పలు హిందీ పోటీలలో విజేతలైన 37 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పండిత పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లేసు, కనిపెట్ట పద్మావతి, తెరవే ప్రధాన కార్యదర్శి రఘుపాత్రుని రమణమూర్తి, ఆర్.లక్ష్మి, ప్రిన్సిపాల్ పుక్కళ్ల లక్ష్మణ్, ఈరంకి ఉమారాణి, సింగూరు రాధ, మినతికుమారి, పద్మనాభ రాజు, ఎం.రవికుమార్, ఎస్‌టీపీ శిరీష, వై.పద్మలక్ష్మి, మాలతి, పద్మజ పాల్గొన్నారు.

పలాసలో హిందీ దివస్ వేడుకలు

పలాస: పలాసలో ఆదివారం జాతీయ హిందీ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని 30 మండలాల నుంచి హిందీ ఉపాధ్యాయులు హాజరయ్యారు. రాష్ట్రంలో హిందీ భాష ప్రాథమిక స్థాయి నుంచి బోధన జరగాలని, అన్ని సబ్జెక్టుల మాదిరిగానే హిందీకి కూడా 35 మార్కులను కేటాయించాలని, అందుకు తగ్గ ఉపాధ్యాయులను నియమించాలని తీర్మానించారు. హిందీ ప్రధానోపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన హిందీ టీచర్లను సన్మానించారు. హిందీలో 100 మార్కులను పొందిన విద్యార్థులకు సత్కరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంఈఓలు శ్రీనివాసరావు, సత్యం, ఉపాధ్యాయ సంఘం నాయకులు బల్ల సుభాష్‌బాబు, బాబూరావు, భాగ్యలక్ష్మి, సింహాద్రి పండా తదితరులు పాల్గొన్నారు.

రణభేరి జాతా విజయవంతం చేయండి



యూటీఎఫ్ రణభేరి జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం: పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్న ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని చెప్పారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలని, డీఏలు విడుదల చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 57 మెమో మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సెప్టెంబర్ 19 వరకు రణభేరి జాత జరుగుతుందని, సెప్టెంబర్ 25న రణభేరి సభ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాష్‌రావు, నగర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.సీతారాం, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నార్త్‌జోన్ టోర్నీలో సిక్కోలుకు మరో విజయం



ఎం.పూర్ణచంద్ర



బి.జగదీశ్వరరావు



ఎన్.సుశాంత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు మరో విజయాన్ని నమోదు చేసింది. జిల్లా జట్టు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సమష్టిగా రాణించడంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు తూర్పుగోదావరితో జరిగిన మల్టీడేస్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో సాధించిన 59 పరుగుల కీలకమైన ఆధిక్యతంతో శ్రీకాకుళం జయభేరి మోగించింది. విజయనగరం జిల్లా వేదికగా ఏసీఏ నార్త్‌జోన్ అంతర్ జిల్లాల త్రీడేస్ (మల్టీడేస్) పురుషుల అండర్–23 క్రికెట్ టోర్నమెంట్ వారం రోజుల కిందట మొదలైన విషయం తెలిసిందే. రెండో మ్యాచ్‌లో తూర్పుగోదావరితో శ్రీకాకుళం తలపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు ఆలౌటైంది. లెఫ్టార్మ్‌స్పిన్నర్ మొదలవలస పూర్ణచంద్ర అత్యద్భుతమైన బౌలింగ్ చేసి ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి 310 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యంతో మ్యాచ్ ప్యాయింట్లను శ్రీకాకుళం నిలబెట్టుకుని విజయం సాధించినట్టయింది. జిల్లా జట్టులో మిడిలార్డర్ బ్యాటర్ బొద్దంకి జగదీశ్వరరావు 106 పరుగులతో అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓపెనర్ నంబళ్ల సుశాంత్ 72 పరుగులతో రాణించాడు.


జట్టు క్రీడాకారులకు అభినందన..

నార్త్‌జోన్ అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నీలో వరుసగా రెండో విజయాన్ని నమోదుచేయడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు క్రీడాకారులను అభినందించారు. స్వయంగా మైదానం వద్దకు చేరుకుని క్రీడాకారులకు మిఠాయిలు పంచిపెట్టారు. జిల్లా జట్టు సమష్టిగా రాణించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ అమ్మద్, కోశాధికారి మదీనాశైలానీ, కౌన్సెలర్ డాక్టర్ ఎస్.రవికుమార్ హర్షం వ్యక్తంచేశారు. జిల్లా జట్టుకు సెలక్టర్‌గా జయశంకర్, కోచ్ కమ్ మేనేజర్‌గా రవితేజ వ్యవహరిస్తున్నారు.

మహిళల క్రికెట్ అభివృద్ధికి..

శ్రీకాకుళంలో మహిళా క్రికెట్ విస్తరణ, అభివృద్ధి కోసం జిల్లా క్రికెట్ సంఘం మరో అడుగుముందుకేసింది. బాలికల క్రికెట్ సబ్‌సెంటర్‌ను శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం కోసం పాఠశాల హెచ్‌ఎంతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. క్రీడామైదానంలో సగభాగాన్ని క్రికెట్ విస్తరణకు వినియోగించనున్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పెట్టి ఆటోడ్రైవర్ల బతుకులు సర్వనాశనం చేసిందని ఆటోమోటారు డ్రైవర్ల సంఘం యూనియన్ నాయకుడు టి.తిరుపతిరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, మోటార్ కార్మికులకు వాహన మిత్ర రూ.25వేలు తక్షణమే ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అధిక ఫీజులు, పెనాల్టీలు పెంచే జి.ఓ.లు 21,31లను రద్దు చేయాలని కోరారు.సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్పదన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు టి.సురేష్, కె.రాజు, గోవిందరావు, నరసింహులు, రాజు, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ద్రాక్ష



పొందూరు: లోలుగు కేజీబీవీ విద్యార్థిని ఎం.ద్రాక్ష జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–18 విభాగంలో జిల్లా స్థాయిలో షాట్‌పుట్‌లో మొదటి స్థానం, డిస్కస్ త్రోలో రెండో స్థానంలో నిలిచింది. ఈ నెల 27 నుంచి 29 వరకు ఏలూరు జిల్లా అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి, పీఈటీ రూపవతి తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారురు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

– రణస్థలం